నిర్మలమైన ఆకాశం నుంచీ కురుస్తున్న "పున్నమి" వెన్నెలను తదేకంగా చూస్తున్న, బాల్కనీలో కూర్చున్న "శ్రావణి" అడుగుల సవ్వడి వినిపించి ఈ లోకంలోకి వచ్చింది.

"నవ్వుతూ... తుళ్ళుతూ... వస్తున్న "రవళి", "మురళి"లను చూచి తృళ్ళిపడి "అప్పుడే తొమ్మిదయిందా" అనుకుంటూ లేచింది.

"సాగర్ క్యాంప్‌లో వున్నప్పుడు, బాల్కనీలో కూర్చుని... ప్రకృతి సౌందర్యాన్నే కాకుండా... రోడ్‌పై జరిగే వింతలూ... విశేషాలూ తిలకించడం... శ్రావణి దినచర్య అయిపోయింది. "ఎదుటి ఫ్లాటులో ఉండే... రవళి, మురళీలు ఉదయం ఆఫీసులకి బయలుదేరి సాయంత్రం అయిదున్నర గంటలకి ఇంటికి చేరుకోవటం... తిరిగి ఆరున్నరకి బయటకెళ్ళి... తిరిగి తొమ్మిదిగంటలకు సరససల్లాపాలతో ఇంటికి చేరటం చూస్తుంటే... ముచ్చటయిన జంట అనిపిస్తుంది.

"అదేమిటోగాని పెళ్ళై ఆరునెలలు దాటినా "సాగర్" ఏనాడూ అలాంటి సరదాలకి, షికార్లకీ సుముఖత చూపలేదు. తానేమడిగినా ముభావంగానే ఉంటాడు. నెలలో ఇరవైరోజులు క్యాంపులోనే ఉంటాడు. దానికి తగ్గట్లే ఊరిచివర ఈ ఫ్లాటు.

"ఈ బ్లాకులోని ఇరవైనాలుగు ఫ్లాట్లలో తెలుగు కుటుంబాలు మూడే."

'ఆఖరి అంతస్తులో తాము, ఎదురింట్లో మురళి, రవళిలు, ఇక ఎక్కడో గ్రౌండ్‌ఫ్లోర్‌లో రిటైరైన, జగన్నాధంగారు." ఆయనకు పుట్టెడు చెముడు, భార్యలేదు. ఎవరో ఒక కుర్రాడు ఇంటిపనులు చేస్తాడు. వాడికీ తెలుగురాదు. మిగతా ఫ్లాట్స్‌లో వారికి హిందీ... వాళ్ళవాళ్ళ మాతృభాషలు (మరాఠీ, బెంగాలి, మళయాళం, పంజాబీ మొదలైనవి) తప్ప తెలుగురాదు. ఎదురింటి తెలుగు జంట పగలు ఉండరు.

"ఉడికిన అన్నం మాడువాసన వేస్తుంటే పరుగున వెళ్ళి స్టౌ ఆర్పేసింది శ్రావణి. నాలుగు మెతుకులు తిన్నాననిపించి... వంటగది సర్దుతుంది."

అంతలో......

"నోర్మూయ్ ..." మళ్ళీ నోరెత్తావో... చీరేస్తాను... ఆ ఎదురింటి నుంచీ అరుపులు వినిపించాయి. ఇంతసేపూ సరదాగా నవ్వుతూ... గువ్వల జంటల్లా ఉన్న..! ఆ జంటకి ఇంతలో ఏమయ్యిందె చెప్మా...... ఆలోచిస్తూండగానే...

"ఏం...? మీ మాట నేనెందుకు వినాలి? నేనూ నీతో సమానంగా చదువుకున్నాను... అంతే సంపాదిస్తున్నాను... రవళించింది రవళి కంఠంలో కాఠిన్యం."

"రవళీ! రంకె వేశాడు మురళి."

"చాలించు! నీ పిచ్చి వేషాలు... నువ్వెంత సంపాదించినా... నేను చెప్పినట్లు చేయాల్సిందే. మురళి గళం గర్జించింది."

"అదేం కుదరదు! మీ ఇష్టం మీదైతే నాఇష్టం నాది. అంతే...... రవళి గొంతు ధృఢంగా పలికింది."

"ఛట్" ఎంతపొగరే నీకు?

"శ్రావణి" ఒక్కసారి ఉలిక్కిపడింది. తలుపు తెరచి చూద్దామనుకుంధి. అప్పటికే పదిగంటలు దాటింది.

"అంతలో మళ్ళీ ధన్... ధన్... చప్పుడు, అమ్మో! అనే కేక ఒకేసారి వినిపించాయి. ఠక్కున కరెంటు పోయింది."

"పిరికి శ్రావణి ముందుకి అడుగువేయబోయి... అక్కడే ఆగిపోయింది."

"రాత్రంతా బిక్కుబిక్కుమంటూ కలతనిద్రలో గడిపిన శ్రావణి... పొద్దున్నే లేచి తలుపుతీసేందుకు భయంవేసి పనమ్మాయి వచ్చాక పాలుతెచ్చాకో చూద్దాంలే... అనుకుని ఊరుకుంది. కానీ... రాత్రి సంఘటన మనసులో పీకుతూనే ఉంది. తమదే చివరి ఫ్లాటు కావటం వలన... వేరెవరైనా వస్తారనే ఆశ ఏ కోశానా లేదు. ఉదయం ఏడుగంటలు దాటితే కానీ పనిపిల్ల రాదు. అపుడు గుర్తుకొచ్చింది... ఆ రోజు ఆదివారం అని. పనమ్మాయి రాదని లోలోపలే తిట్టుకుంటూ ఫ్రిజ్‌లోని క్రితం రోజు పాలుతీసి వేడిచేసుకుని బోర్నవిటా కలుపుకుని కప్పుతో సహా బాల్కనీలోకి వచ్చి... నిల్చుంది శ్రావణి. క్రితంరాత్రి ఎదురింట్లోని గొడవ గురించే ఆలోచిస్తూ నిలుచుంది. ఈ పాటికి బయటకు వచ్చే ఆ జంట... ఇంకా కనపడకపోయేసరికి... శ్రావణికి కంగారెక్కువయ్యింది. అనుమానంతో ఎదురింటి వైపు దృష్టి సారించిన శ్రావణి గుండె




స్పందన హెచ్చింది. దేహం జల్లుమంది. నుదుటిపై స్వేదబిందువులు ముత్యాల్లా మెరిశాయి.

"తలుపు సందులోంచి కొద్దిగా కారి బయటకు వచ్చింది రక్తధార. రవళి నిన్న సాయంత్రం కట్టిన తెల్లటి చీరకొస... ఆ దారలో తడిసి... తలుపు సందులోంచి బయటకు తొంగిచూస్తోంది. స్థాణువైన శ్రావణికి కొద్దిసేపటికి కర్తవ్యం గుర్తుకొచ్చి... ఎదురింటి తలుపు తట్టబోయి, తిరిగి వెనక్కుతగ్గి... లిఫ్ట్‌కూడా ఎక్కకుండా... అయిదంతస్తుల ఆ ఫ్లాట్ మెట్లు ఒక్కఉదుటున... క్రిందకు చేరి... "జగన్నాథం" గారింటి తలుపు తట్టింది. ఆయనకి అర్థం అయ్యే రీతిలో చెప్పేసరికి తలప్రాణం తోకకొచ్చినట్లయింది.

ఆయన ఆ బ్లాకులోని మరికొందరికి చెప్పేసరికి... పదిహేను నిముషాలు పట్టింది. అప్పటికే... ఆదివారం అవటం వలన సరదాగా బయటకు వెళ్ళిపోయారు మిగిలిన వాళ్ళు అందరూ. అయిదవ అంతస్థుచేరుకున్నారు దాదాపు అందరూ ఆడవారు కావటం వలన... ఎవరూ చొరవ చూపలేకపోయారు. నైట్ డ్యూటీ ముగించుకొని అపుడే చేరిన సర్దార్‌జీ సంగతి విని ఆఘాలమేఘాల మీద రవళి వాళ్ళ ఫ్లాటు చేరుకొని కాలింగ్ బెల్ నొక్కి ప్రయోజనం లేకపోగా... వెంటనే పోలీస్‌స్టేషన్‌కి ఫోన్‌చేసి అర్జంటుగా రావలసిందని జరిగిన విషయాన్ని క్లుప్తంగా వివరించాడు.

"ఆ పొలిమేరకి పోలీసులు చేరేసరికి గంటపైగా పట్టింది." వారు వస్తూనే ఎవరూ ఏదీ ముట్టుకోవద్దు. దగ్గరకు రావద్దు... అంటూ హడావిడి చేస్తూ... తలుపు తీయటానికి ప్రయత్నించారు. ఎంతకీ రాకపోవటంతో తలుపులు బద్దలు కొట్టటానికి సిద్ధపడ్డారు. నిన్నరాత్రి జరిగిన సంఘటన ఆ ఫ్లాటులోని వారినోటవెంట రకరకాలుగా మారి దాని రూపురేఖలు మరింత వికృతంగా తయారయ్యాయి. పోలీసులు తలుపులు పగులకొట్టబోగా ఒక్కసారిగా అందర్నీ విభ్రాంతిలో ముంచుతూ తలుపులు బార్లగా తెరుచుకున్నాయి. ఏమిటిదంతా? అని పోలీసులు ప్రశ్నించేలోపుగా... మురళీ, రవళి... నవ్వుతూ వెనుక దాచుకున్న తనచేతులను ముందుకు చాచారు. వారిచేతులలోని అట్టపై... "ఏప్రియల్ ఫూల్" అని ఉంది. తాము కొన్న "కలర్‌బాటిల్"కు కొద్దిగా ఖర్చయినా... తమ ప్లాను సక్సెస్ అయి అందరూ ఫూల్స్ అయినందుకు గొల్లున నవ్వారు.

అనాలోచితంగా... తామందరూ చేసిన ఈ హడావిడికి మూలం శ్రావణి అయినా... ఆమెనేమి అనలేక... ఆమెతో పాటు తాముకూడా ఏప్రియల్ ఫూల్స్ అయినందుకు... బాధపడుతూ... ఏమీ చేయలేక అందరూ ఒక్కసారి గొల్లున నవ్వారు.

"పాపం! పోలీసులకి ఏంచేయాలో తెలియక... తాముకూడా వారితో శృతి కలిపారు."

"శ్రావణి మాత్రం కొద్దిగా సిగ్గుతో తలవంచుకుంది."